విశాలాంధ్ర అనంతపురం

www.visalaandhra.com

కర్నూలు, సోమవారం 24, ఏప్రిల్ 2023

లీలావతి వృద్ధాశ్రమంలో అన్నదానం

విశాలాంధ్ర-యాడికి: మండల పరిధిలోని రాయల చెరువు గ్రామంలో ఉన్న లీలావతి వృద్ధాశ్రమంలో పెద్ద పేట గ్రామానికి చెందిన బాబా ఫక్రుద్దీన్ అతని కుటుంబ సభ్యులు ఆదివారము వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు ఆశ్రమ నిర్వాహకురాలు పరిమి కృష్ణవేణి తెలిపారు. అన్నదాన ం నిర్వహించిన బాబా ఫక్రుద్దీన్ వారి కుటుంబ సభ్యులు నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో ఉండాలని వృద్ధులు దీవించారు.

ఇతర కులాలను ఎస్టీ జాబితాలో చేరిస్తే ఉద్యమిస్తాం

విశాలాంధ్ర-ఉరవకొండ : ఎస్టీ కులాలు యొక్క హక్కులకు భంగం కలిగించే విధంగా బోయ, వాల్మీకి, బొంతు ఒరియా, ఇతర కులాలను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు ప్రయత్నాలు చేస్తే తాము తీవ్రంగా ఉద్యమిస్తామని గిరిజన సంఘం జిల్లా నాయకులు మూడ్ కేశవ నాయక్ తదితరులు పేర్కొన్నారు. ఆదివారం ఉరవకొండలో వారు విలేకరులతో మాట్లాడుతూ అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని ఉపసంహరించుకోవాలని కోరుతూ ఈనెల 24వ తేదీన సీఎం జగన్మోహన్ రెడ్డి ఇంటికి ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు

తెలిపారు, బోయ వాల్మీకి బెంతు ఒరియాకులాలను ఎస్టీ జాబితాలో చేర్చకూడదని చలో విజయవాడ కార్యక్రమం చేపట్టామని తెలిపారు, ఈ కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలని గిరిజనులును పేర్కొన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో చౌహాన్ రంజిత్ నాయక్, సుగాలి గోపాల్ నాయక్ , అంజి నాయక్,సుగాలి రమేష్ నాయక్, శ్రీరామ్ నాయక్, శివశరణ్ నాయక్, సేవ్య నాయక్, వెంట నాయక్ , ఈశ్వర్ నాయక్ , వెంకటేష్ నాయక్, భీమ నాయక్ , కొర్ర రమేష్ నాయక్, తాడపత్రి సురేష్, ప్రతాప్ నాయక్, సాయికుమార్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

వెంకటరామిరెడ్డి కుటుంబానికి అండగా ఉంటాం

విశాలాంధ్ర-చెన్నేకొత్తపల్లి : చెన్నేకొత్తపల్లి మండలం నామాల గ్రామానికి చెందిన వైఎస్ఆర్సిపి నాయకుడు బుర్ర వెంకటరామిరెడ్డి కుటుంబానికి అన్ని విధాల అండగా ఉంటామని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి హామీ ఇచ్చారు. అనారోగ్యంతో బాధపడుతూ వెంకటరామిరెడ్డి మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆదివారం ఉదయం గ్రామానికి వెళ్లి వెంకటరామిరెడ్డి భౌతికకాయానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను ఓదార్చారు. పార్టీ కోసం కష్టపడి పని చేస్తూ అనారోగ్యంతో బుర్ర వెంకట్రామిరెడ్డి మృతి చెందటం పార్టీకి తీరనిలోటని, పార్టీలో చురుకైన నాయకుడిని కోల్పోయామని ఎమ్మెల్యే అన్నారు. వెంకటరామిరెడ్డి కుటుంబానికి లక్ష రూపాయలు అందజేస్తున్నట్లు ఎమ్మెల్యే ప్రకటించారు. ఎమ్మెల్యే వెంట సికె పల్లి మండల కన్వీనర్ న్యామద్దల రామకృష్ణారెడ్డి, జడ్పిటిసి మైలారపు గోవిందరెడ్డి, మండల వైస్ ప్రెసిడెంట్ ప్యాదిండి నరసింహారెడ్డి, మేడాపురం జోగన్నగారి సూరి, ఫీల్డ్ అసిస్టెంట్ మల్లికార్జున, మనేరు నరసింహులు, లక్ష్మీ రెడ్డి తదితరులు ఉన్నారు.

ఉద్యోగుల ఆందోళనకు మద్దతు

విశాలాంధ్ర-అనంతపురం అర్బన్: ఏపీ ఎన్జీవో అమరావతి జేఏసీ ఆందోళనకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి పేర్కొన్నారు. ఈమేరకు ఆదివారం మీడియాకు ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 25 న జిల్లా కలెక్టరేట్ ఎదుట జరగనున్న పభుత్వ ఉద్యోగుల సామూహిక ధర్నాకు ఏఐటీయూసీ అనుబంధ ప్రజా సంఘాల మద్దతు ఉంటుందని అన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేస్తానని, సిపిఎస్ రద్దు చేస్తానని, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తానని ఎన్నికల ప్రచారంలో హామీలు గుప్పించిన వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వాటిని విస్మరించి అన్నివర్గాల ప్రజలను మోసం చేశాడని విమర్శించారు.ఉద్యోగులకు ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా నెరవేర్చిన పాపాన పోలేదని తూర్పారబట్టారు. తక్షణమే ఉద్యోగు హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు.ఆప్కాస్ పద్ధతి తో ఎన్నడూ లేని విధంగా కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని మండిపడ్డారు.ఈ నెల 25 న జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద సామూహిక ధర్నా, 29 న సచివాలయాల వద్ద చేపడుతున్న ఆందోళనలకు ,ఉద్యోగులు తలపెట్టిన ఉద్యమానికి ఏఐటి యుసి సంపూర్ణ మద్దతు తెలియజేస్తోందని రాజారెడ్డి తెలియజేశారు.

అటో బోల్తా... డ్రైవర్ మృతి

విశాలాంధ్ర-విడపనకల్లు: మండలం కొట్టాలపల్లి సమీపంలో అటో బోల్తా పడి డ్రైవర్ మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. ఉరవకొండ నుండి ఆటోలో ప్రయాణికులను ఎక్కించుకుని వెళు తుండగా ప్రమాదవశాత్తు ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటో నడుపుతున్న తిమ్మప్పకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు హుటాహుటిన ఉరవకొండ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే తిమ్మప్ప మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

వైసీపీ గెలుపు తథ్యం

విశాలాంధ్ర-తాడిపత్రి: టైమ్స్ నౌ సర్వే ప్రకారం 2024 సంవత్సరం లో జరగబోయే ఎన్నికలలో పార్లమెంట్ స్థానాల్లో అన్ని స్థానాలను గెలుచుకుంటుం దని సర్వేలో వెల్లడించింది. దీన్నిబట్టి చూస్తే రాబోవు అసెంబ్లీ ఎన్నికలలో వైఎస్ఆర్సిపి అధికారం చేపట్టడం తథ్యం అని వైసీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య పత్రికాముఖంగా వెల్లడించారు. ఆదివారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం సచివాల వ్యవస్థను ఏర్పాటు చేసి వాలంటీర్ల ద్వారా ప్రజల కోసం ఎన్నో సంక్షేమాలు ప్రవేశపెట్టి నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి జమ చేస్తున్న ప్రభుత్వం దేశంలో వైఎస్ఆర్సిపి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వమేనన్నారు. ఇలా జగన్మోహన్ రెడ్డి కి ఉన్న ప్రజల ఆదరణను చూసి ఓర్వలేక తెలుగుదేశం పార్టీ నాయకులు చంద్రబాబు నాయుడు, లోకేష్ లు అల్లరి మూకలను రెచ్చగొట్టి వైసీపీ నాయకులపై బుడగజల్లుతూ దాడులు చేస్తున్నారన్నారు. చంద్రబాబు నాయుడు అధికారంలో ఉన్నప్పుడు నీరు చెట్టు, జన్మభూమి కమిటీలు, స్కిల్ డెవలప్మెంట్, అమరావతి అభివృద్ధి పేరుతో అవినీతికి పాల్పడ్డారన్నారు. రాబోవు ఎన్నికలలో ఫ్యాన్ తుఫాను గాలికి తెలుగుదేశం పార్టీ కొట్టుకుపోతుందని చెప్పారు.

పోతులయ్యకు ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర-రాప్తాడు: మండలంలోని గంగలకుంట గ్రామంలో పోతులయ్యను బుల్లే లక్ష్మీ, బుల్లే నగేష్ దంపతుల ఆధ్వర్యంలో శనివారం రాత్రి భక్తిశ్రద్ధలతో గ్రామవీధుల్లో ఊరేగింపు చేశారు. ఆదివారం ఉదయం భక్తులు కాయకర్పూరం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మాజీ మంత్రి పరిటాల సునీత, టీడీపీ మండల ఇంచార్జి ధర్మవరపు మురళీ, మండల టీడీపీ నాయకులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఘనంగా బసవ జయంతి

విశాలాంధ్ర-బొమ్మనహాల్: వీరశైవ లింగాయతల ఆరాధ్య దైవం బసవేశ్వరుని జయంతి వేడుకలను వీరశైవ లింగాయతులు ఆదివారం మండలంలోని గోవిందవాడ గ్రామంలో వీరభద్ర స్వామి ఆలయంలో బసవ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం బసవేశ్వర చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించిన రథంలో కొలువుదిర్చి పూజలు నిర్వహించారు. వి వీరభద్రస్వామి ఆల యం నుండి వందలాదిమంది వీరశైవలా సోదరుల ఊరేగింపు నిర్వహించారు.

రైతు ఆత్మహత్య

విశాలాంధ్ర గుమ్మఘట్ట: మండలంలోని ఆర్ కొత్తపల్లి గ్రామానికి చెందిన తిమ్మారెడ్డి (55) ఆదివారం తన పొలంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానిక ఎస్సై సునీత తెలిపిన వివరాల మేరకు రైతు తిమ్మారెడ్డికి గత రెండేళ్లుగా తీవ్రమైన కడుపునొప్పి వచ్చేదని, చాలాచోట్ల వైద్యులకు చూపించిన ప్రయోజనం లేకపోయిందన్నారు. ఆదివారం తన పొలంలో ఉండగా తట్టుకోలేనంతగా కడుపు నొప్పి రావడంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడని తెలియజేశారు. వెంటనే చికిత్స కోసం రాయదుర్గం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ,ప్రథమ చికిత్స అనంతరం బళ్ళారి విమ్సుకు తరలించారు. అక్కడ పరిస్థితి విషమించి మృతి చెందినట్లు తెలిపారు .ఎస్సై సునీత కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు వివరించారు.

మోడీ పాలనలో కోట్లకు పడగెత్తిన కుబేరులు

విశాలాంధ్ర-రాప్తాడు: కేంద్రంలోని బీజేపీ ప్రధాని మోడీ తొమ్మిదేళ్లపాలన కోట్లకు పడగలెత్తిన కుబేరులకు తప్ప, దేశంలోని సామాన్య ప్రజలకు ఏమాత్రం ఉపయోగకరంగా లేదని... రైతులు, కార్మికులు, యువకులతో పాటు అన్ని వర్గాల ప్రజలు మోదీ పాలనపై విసుగెత్తి ఉన్నారని ఆయన్ను ప్రధాని ఉద్యోగం నుంచి తప్పించడానికి ఎన్నికల కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.జగదీష్ అన్నారు. నరేంద్ర మోడీని గద్దె దింపండి.. దేశాన్ని కాపాడండి అనే నినాదంతో నిర్వహించ తలపెట్టిన ప్రచారభేరి ఆదివారం అనంతపురం రూరల్ మండలం కందుకూరు ఎఫ్. సి. ఐ. గోడౌన్ నుండి సమతాగ్రామ్ వరకు పాదయాత్ర చేశారు. ఈప్రచారభేరికి సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు సి. జాఫర్, వి.రాంభూపాల్, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు మల్లికార్జున, నారాయణస్వామి, రైతు సంఘం జిల్లా నాయకులు ఆర్.చంద్రశేఖర్ రెడ్డి, హాజరయ్యారు. జగదీష్ మాట్లాడుతూ ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు భర్తీ చేస్తూ దేశంలో నిరుద్యోగ సమస్యను పూర్తిగా రూపుమాపుతానని, యువతకు హామీ ఇచ్చిన మోదీ.. ప్రధాని అయ్యాక వాటిని పెడచెవిన పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మోడీ పాలనలో ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమైందని, అస్తవ్యస్త విధానాలతో నియంతలా వ్యవహరిస్తున్న ఆయన పాలకుడిగా అనర్హుడని విమర్శించారు. నియంత పాలనను తరిమికొట్టే సమయం ఆసన్నమైందని స్పష్టంచేశారు. ప్రభుత్వరంగ సంస్థలన్నింటినీ ఏకపక్షంగా అమ్మకానికి పెట్టి తన అనుయాయులైన అంబానీ, ఆదానీలకు దోచిపెడుతున్నారని ఆరోపించారు. ఎన్నికల సమయంలో రైతుల ఆదాయం రెట్టింపు చేస్తానని, ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తానని, విదేశాలలో మూలుగుతున్న నల్లధనాన్ని తెచ్చి ప్రతి కుటుంబానికి రూ .15 లక్షలు ఖాతాలో జమ చేస్తానని వాగ్దానం చేసి ప్రజలను మోసగించడం మోడీకే చెల్లిందని ధ్వజమెత్తారు. . జంగాలపల్లి ఎఫ్. సి. ఐ. గోడౌన్ తోపాటు దేశంలోని అనేక ప్రభుత్వ సంస్థలను కార్పొరేట్లకు అప్పజెప్పేలా ప్రభుత్వ పాలసీగా మార్చేశారన్నారు. దీనివల్ల ఉద్యోగులు, కార్మికులు, కూలీలు రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాన ప్రతిపక్షం టీడీపీ, జనసేన కూడా మోడీని ప్రశ్నించలేని నిస్సహాయ స్థితిలో ఉన్నాయన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఏకతాటిపైకి వచ్చి మతతత్వ బీజేపీని ఓడిద్దామని పిలుపునిచ్చారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి జాఫర్ మాట్లాడుతూ ప్రత్యేక హెూదా, పోలవరం నిధులు, ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యల పరిష్కారం, పరిహారం చెల్లింపు, అమరావతి రాజధాని నిర్మాణం, రైల్వే జోన్, రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ వంటి హామీలన్నీ ప్రధాని మోడీ పక్కనపెట్టేశారని మండిపడ్డారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్, పప్పు, నూనె ధరలు ఇష్టానుసారం పెంచి, సామాన్యుడి నడ్డి విరిచారని ఆరోపించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రయోజనాలను కాపాడవలసిన సీఎం జగన్ తన కేసులకు భయపడి మోడీకి అవసరం లేకపోయినా పరోక్ష మద్దతు ఇస్తూ ఏపీ ప్రజలను నిలువునా మోసం చేస్తున్నాడని ఎద్దేవా చేశారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి వి.రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు వైఎల్ రామాంజనేయులు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రాజారెడ్డి, రాప్తాడు నియోజకవర్గ సహాయ కార్యదర్శులు నాగరాజు, శ్రీకాంత్, సిపిఐ అనంతపురం రూరల్ మండల కార్యదర్శి రమేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు కేశవరెడ్డి, మహిళా సమాఖ్య పద్మావతి, ఏఐటీయూసీ రాజేష్, సంతోష్, ఏఐఎస్ఎఫ్ ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మల్లికార్జున, చిరంజీవి, కుళ్ళాయిస్వామి, ఆనందకుమార్, ఉమామహేష్, ఏఐవైఎఫ్ రాప్తాడు నియోజకవర్గ కార్యదర్శి ధనుంజయ, రాప్తాడు నియోజవర్గ రైతు సంఘం అధ్యక్ష కార్యదర్శులు. చలపతి, వెంకటనారాయణ, సిపిఎం రైతు సంఘం జిల్లా. కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, సిపిఎం నాయకులు. రామాంజనేయులు, శివశంకర్, పోతలయ్య, రామకృష్ణ, మహిళా సమాఖ్య నాయకురాళ్లు శారద, జయలక్ష్మి, లక్ష్మీదేవి, చౌడమ్మ, సుధామణి, నాయకులు దుర్గాప్రసాద్, రెడ్డప్ప, నల్లప్ప, శ్రీరాములు, పాండు, విజయ్, అక్కులన్న, నరసింహులు, నాగభూషణ, ఎర్రపోతున్న, జీపి ఓబులేసు, ప్రజా సంఘాల నాయకులు. సిపిఐ జిల్లా సమితి సభ్యులు. తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం రూరల్: రాయదుర్గం పట్టణంలో ఆదివారం సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో బిజెపి పార్టీ విధానాలను వివరిస్తూ 10వరోజు 15,16,17 వార్డ్ లో రైల్వే స్టేషన్ రోడ్లో ప్రచార బేరిని నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కమిటీ సభ్యుడు నాగార్జున మాట్లాడుతూ రాజ్యాంగ హక్కులను కాలరాస్తూ ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలనుసాగనం పాల్సిందెనని, కార్పొరేట్ కంపెనీలకు కాపలాకాస్తున్న నరేంద్ర మోడీ నీగద్దె దింపాల్సిందేఅని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న ఈ రెండు పార్టీలను గద్దె దింపాల్సిందేఅని తెలియజేశారు. అధికారంలో ఉన్న కేంద్ర బిజెపి ప్రభుత్వం 2014 నుండి నేటి వరకు రెండుసార్లు అధికారం చేపట్టింది. అధికారం చేపట్టినప్పటి నుండి నేటి వరకు పేదల పక్షాన నిలబడిన పాపాన పోలేదని, కార్పొరేట్లకు కొమ్ము కాస్తూ ప్రభుత్వ రంగ సంస్థలను అప్పనంగా కట్టబెడుతూ ఆర్ఎస్ఎస్ కనుసన్నల్లో పాలన సాగిస్తున్న బిజెపి ప్రభుత్వం 9సంవత్సరాల పాలనలో 2014 ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను విస్మరించిందని, కేంద్ర ప్రభుత్వం పై మండిపడ్డారు. నల్లకుబేరులను అపర కుబేరులుగా తీర్చి దిద్దుతూ నేడు దేశవ్యాప్తంగా ఉన్న వ్యవసాయ సంక్షోభాన్ని , విద్య వైద్య విధానాన్ని, పెడచెవిన పెట్టి నిరుద్యోగ సమస్య నిర్మూలించకుండా నిత్యవసర వస్తువుల ధరలను పెంచి పెట్రోల్,డీజిల్ ,గ్యాస్ ,ధరలను విపరీతంగా పెంచి వినియోగదారులపై గుది బండ మోపిందని ప్రభుత్వ విధానాలను దుయ బట్టారు. గురుస్వామి, నర్సింహులు ,నాగరాజ్ ,తిప్పేస్వామి, సుజాతమ్మ ,పార్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఏం చేశారని జిల్లాకు వస్తున్నారు సీఎం గారు

విశాలాంధ్ర-గుంతకల్లు : అనంతపురం జిల్లాకి ఇచ్చిన వాగ్దానాలు గాలికి వదిలేసి ఏ ముఖం పెట్టుకొని అనంతపురం జిల్లాకి వస్తున్నారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి.జగదీష్ ప్రశ్నించారు.ఆదివారం స్థానిక సిపిఐ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డి.జగదీష్ మాట్లాడుతూ...తొలి సారి ముఖ్యమంత్రిగా అయిన తర్వాత అనంతపురం బహిరంగ సభలో జగన్ మోహన్ రెడ్డి హంద్రీ-నివా కాలువలు చూసి వెడల్పు చేసి ఐదువేల క్యూసెక్కుల కు మరో సమాంతర కాలువ ద్వారా ఇంకొక 5, వేల క్యూసెక్కుల హంద్రీ-నివా నుండి జీడిపల్లికి తీసుకువస్తామని వాగ్దానం చేశారు. అయితే దాని సంగతి అతిలేదు గతి లేదని మండిపడ్డారు. నాలుగు సంవత్సరాలు అవుతున్న తుంగభద్ర హెచ్ ఎల్ సి కెనాల్ ని ఆదుని కరణ చేస్తామని వాగ్దానం చేశారు. నాలుగు సంవత్సరాలు అవుతున్న ఏమాత్రం ఆదుని కరణ చేయలేదని ప్రశ్నించారు. అదేవిధంగా అనంతపురం ఉమ్మడి జిల్లాలలో మూడు లక్షల 50 వేల ఎకరాలకు సాగునీరు అందించి పిల్ల కాలువలు ఏర్పాటు చేస్తామని నమ్మం పలికారు.అయితే ఇంతవరకు ఎక్కడ కూడా ఎక్కడి గొంగళి అక్కడే అన్నట్టు ఉందని ఎదేవచెశారు.ముఖ్యమంత్రి పేరూరు డ్యామ్ కి నీళ్లు అందించడానికి రెండు రిజర్వాయర్ కి న్యామద్దల, తోపుదుర్తి కి రిమోట్ కంట్రోల్ ద్వారా శంకుస్థాపన చేశారు.అయితే ఇప్పటికి కూడా కార్య రూపం దాల్చలేదని తెలిపారు.అలాంటప్పుడు 26 తారీకున ఏ ముఖం పెట్టుకొని అనంతపురం కి వస్తున్నారని ప్రశ్నించారు. వసతి దీవన బటన్ నొక్కడానికి ఇంతదూరం వచ్చి కోట్లాది రూపాయలు ప్రజల డబ్బును దుర్వినియోగం చేస్తున్నావని ప్రశ్నించారు. జిల్లాలో పంటలన్నీ నష్టపోయి ఖరీఫ్ రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని అన్నారు. ఆత్మహత్యలు చేసుకోవడం దేశంలో మూడో స్థానంలో ఉందని అన్నారు. ఇంతవరకు ఏడవ స్థానంలో ఉంటే ప్రస్తుతం మూడో స్థానంలో ఉందని తెలిపారు. నష్టపోయిన రైతులకు పరామర్శించడానికి బరోసా కల్పించేందుకు

రాలేదు కాని బటన్ నొక్కడానికి వస్తున్నాడంటా సార్ ! అకాల వర్షాల వల్ల జిల్లాలో నష్టపోయిన రైతుల కుటుంబాలను ఆత్మశైర్యం నింపేందుకు రావాలి..రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదు కాని ఏ ముఖం పెట్టుకుని అనంతపురంకి వస్తున్నావని ప్రశ్నించారు.. బటన్ నొక్కడానికోసం వచ్చాడనుకుంటే అది కాదు మీడియాని దూషించడం, ప్రతిపక్షాలను తిట్టడం కోసమే అజెండా పెట్టుకున్నాడని అన్నారు. అనంతపురం జిల్లా కి వస్తున్నాడు అంటే ఏమి వరాలు ఇస్తాడని ప్రజలు ఆశిస్తున్నారు. అయితే ఆయన ఏ హామీ ఇచ్చే పరిస్థితి కనబడలేదని అన్నారు.. ఈనెల 26వ తేదీన గుంతకల్లులో మోడీకి హటావో దేశ్ కి బచావో అనే కార్యక్రమానికి ముఖ్య అతిథులు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ,సిపిఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఓబుల కొండ రెడ్డి హాజరవుతారని తెలిపారు.అదేవిదంగా పాత గుంతకల్ నుండి రైల్వే స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించడంహూ జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలందరూ జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బి.గోవిందు, సిపిఐ నియోజవర్గం కార్యదర్శి వీరభద్రస్వామి, సిపిఐ పట్టణ కార్యదర్శి గోపీనాథ్, సిపిఐ మండల కార్యదర్శి రాము రాయల్, సిపిఐ మండల సహాయ కార్యదర్శి రామాంజనేయులు, ఏఐటియుసి మండల కార్యదర్శి ఈశ్వరయ్య పాల్గొన్నారు.

ప్రశాంతంగా ప్రవేశ పరీక్షలు

విశాలాంధ్ర-ఉరవకొండ: సాంఘిక సంక్షేమ అంబేద్కర్ గురుకుల విద్యాలయాల్లో ఐదవ తరగతి మరియు జూనియర్ ఇంటర్లో ప్రవేశానికి నిర్వహించిన పరీక్షలు ఆదివారం ఉరవకొండలో ప్రశాంతంగా ముగిశాయి. స్థానిక అంబేద్కర్ గురుకుల పాఠశాలలో నిర్వహించిన ఈ ప్రవేశ పరీక్షకు ఐదవ తరగతి ప్రవేశం సంబంధించి 686 మంది విద్యార్థులు, మరియు ఇంటర్ ప్రవేశ పరీక్షకు 343 మంది విద్యార్థులు హాజరైనట్లు ప్రిన్సిపల్ తెలిపారు.

వైసీపీ పాలనలో శాశ్వతంగా గుర్తింపు తెచ్చాం

విశాలాంధ్ర-శింగనమల: నాలుగేళ్ల వైసీపీ పాలనలో ప్రజలకు శాశ్వతంగా గుర్తుండిపోయే పనులు చేసి గుర్తింపు పొందామని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ పట్నం నగేష్

ఆదివారం సెల్ఫీ ఛాలెంజ్ విసిరారు. శింగనమల నుండి గార్లదిన్నె కు వెళ్లే ప్రధాన రహదారి గత ప్రభుత్వ హయాంలో గుంతలుగా ఉన్నిందని, వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఎమ్మెల్యే రహదారి నిర్మాణం పూర్తి చేశారని, అంతేకాకుండా తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ పాలనలో చెరువులో కలైజేషన్ పేరుతో హెలికాప్టర్ చెరువు మీద చక్కర్లు కొట్టి చేతులు దులుపుకున్నది మరిచారా అని ఎద్దేవ చేశారు.

26న ఖరారైన ముఖ్యమంత్రి పర్యటన

విశాలాంధ్రబ్యూరో-అనంతపురం: రాష్ట్ర ముఖ్యమంత్రి జిల్లా పర్యటన ఏర్పాట్లలో ఏలాంటి లోటు రానీయకుండా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎమ్.గౌతమి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆదివారం ఉదయం కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుండి ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై జిల్లా అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఈనెల 26వ తేదీన సింగనమల నియోజక వర్గం లోని నార్పల మండల కేంద్రంలో రాష్ట్ర ముఖ్యమంత్రి పాల్గొంటున్న జగనన్న వసతి దీవెన కార్యక్రమం ఖరారైన నేపథ్యంలో పర్యటన ఏర్పాట్లలో ఎలాంటి లోటు రానీయకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులతో పాటు పోలీసు అధికారులతో కూడా సమన్వయం చేసుకోవాలని అనంతపురం ఆర్డీవో మధుసూదన్ కు సూచించారు.హెలిపాడ్ నుండి సభాస్థలి వరకు బ్యారికేడింగ్ చేయాలని ఆర్అండ్ బి ఎస్ఈ ఓబుల్ రెడ్డి ని ఆదేశించారు.హెలిపాడ్ వద్ద విఐపి లు వేచి ఉండే ప్రాంతంతో పాటు కాన్వాయ్ వాహనాలలో కూడా త్రాగునీరు, స్నాక్స్ ఏర్పాటు చేసుకోవాలని హెలిపాడ్ ఇంచార్జ్ కళ్యాణ్ దుర్గం ఆర్డీవో నిశాంత్ రెడ్డిని కలెక్టర్ ఆదేశించారు. హెలికాప్టర్ సిబ్బందికి ఆతిథ్య ఏర్పాట్లను పక్కాగా చేపట్టాలని పుట్టపర్తి లోని అధికారులతో కూడా సమన్వయం చేసుకోవాలన్నారు.హెలిపాడ్ నుంచి సభాస్థలి వద్దకు ముఖ్యమంత్రి వచ్చే మార్గంలో తగినంత సిబ్బందితో శానిటేషన్ చేపట్టాలని డిపిఓ ప్రభాకర్ రావుకు సూచించారు.పార్కింగ్ ప్రదేశాలు, సభాస్థలి వద్ద తగినన్ని టాయిలెట్లు, డస్ట్ బిన్ లు ఏర్పాటు చేయాలన్నారు.సమావేశానికి విచ్చేసే కళాశాల, డిగ్రీ కాలేజ్ విద్యార్థులు, లబ్ధిదారులు, తదితరులకు తగినన్ని బస్సులను ఏర్పాటు చేయాలని ఆర్టీసీ ఆర్ఎం సుమంత్, డిటిసిలకు సూచించారు. ఉంచుకోవాలని, డిఎంహెచ్వో, డి సి హెచ్ ఎస్ లకు సూచించారు. ముఖ్యమంత్రికి అందజేసేందుకు విచ్చేసే పిటిషనర్ల నుండి తగినంత సిబ్బందిని ఏర్పాటు చేసుకొని వారి నుండి ముందస్తుగానే పిటిషన్లను స్వీకరించాలని సూచించారు. ం పర్యటన విజయవంతం అయ్యేలా వారికి అప్పజెప్పిన విధులనుఏలాంటి లోటుపాటులకు తావివ్వకుండా, సక్రమంగా నిర్వహించేలా అధికారులందరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు. జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్ మాట్లాడుతూ, అధికారులకు కేటాయించిన విధులతోపాటు ఉన్నతాధికారులు సూచనలను పరిగణనలోకి తీసుకుని తూచా తప్పకుండా పాటించాలన్నారు.

నిరుపయోగంగా మరుగుదొడ్లు

విశాలాంధ్ర-తాడిపత్రి: పట్టణంలోని నందలపాడు ఆంజనేయ మాన్యం, వాటర్ వాస్ బైపాస్ వద్ద ఉన్న పబ్లిక్ మరుగుదొడ్లను సద్వి నియోగంలోకి తేవాలని ఆ కాలనీ ప్రజలు మున్సిపల్ అధికారులను కోరుతున్నారు. ఈ సందర్భంగా కాలనీ ప్రజలు మాట్లాడుతూ దాదాపు ఎనిమిది నెలల నుండి మోటార్ చెడిపోయి మరమ్మతులకు నోచుకోక ఈ పబ్లిక్ మరుగుదొడ్లు వినియోగంలో లేవని

ప్రజలు వాపోయారు. మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది, వార్డు వాలంటీర్లు నిత్యం ఈ కాలనీలో తిరుగుతున్న పట్టించుకోవడం లేదని వాపోయారు. మహిళలమైన తాము బహిర్ భూమికి వెళ్లాలంటే ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వారి ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. ఈ ఆధునిక యుగంలో కూడా మహిళలు బహిర్భూమికి వెళుతున్నారంటే సభ్య సమాజానికి సిగ్గుచేటని పలువురు విమర్శిస్తున్నారు. ఏది ఏమైనప్పటికీ రాజకీయ నాయకు లారా, ప్రజా ప్రతినిధులారా, అధికారులారా ఆ కాలనీలోని మహిళల ఆవేదనను అర్థం చేసుకొని వెనువెంటనే పబ్లిక్ మరుగు దొడ్లను సద్వినియోగంలోకి తేవాలని మహిళలు కోరుకుంటున్నారు.

ఘనంగా బసవ జయంతి

విశాలాంధ్ర-ఉరవకొండ: కుల, మత భేదాలు లేని సమాజ స్థాపనకే అవిరళ కృషి చేసిన గొప్ప సంఘ సంస్కర్త బసవేశ్వరుడు జయంతి వేడుకలను ఆదివారం ఉరవకొండ లోని గవిమఠంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ వివక్షతను సమూలంగా వ్యతిరేకించిన అభ్యుదయవాది, వీరశైవ మత స్థాపకుడు

బసవేశ్వరుడని కొనియాడారు. బసవేశ్వరుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు విట్టల్ రుక్మిణి వృద్ధాశ్రమంలో గవి మఠం సమీపంలో ఉన్న అనాథలకు కూడా పండ్లు బ్రెడ్లు పంపిణీ చేశారు. వ్యాసాపురం బండయ్య, ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వీర శైవ యువకుల మఠం విరుపాక్షి, సతీష్, మంజు, కిరణ్, గణేష్, ప్రేమ్ కుమార్, పవన్ కళ్యాణ్, మారుతి, మణి పృధ్వి, భద్ర పాల్గొన్నారు.

డి.హీరేహాళ్: మండల పరిధిలోని తిమ్మలాపురం గ్రామంలో బసవ జయంతి వేడుకలు కార్యక్రమానికి ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అనంతపురం జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ కాపు భారతి, పాటిల్ అజయ్, మండల గ్రామ సచివాలయం కన్వీనర్ రాళ్ల తిమ్మ రెడ్డి తదితరులు హాజరైయారు. గ్రామ సర్పంచ్ హనుమంతరెడ్డి, బసవరాజు, శ్రీధర్, బసవరాజు గౌడ, రమేష్ రెడ్డి, గన్ని గౌడ, సంఘం నాయకులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర శ్రీ సత్యసాయి

www.visalaandhra.com

కర్నూలు, సోమవారం 24, ఏప్రిల్ 2023

రంజాన్ వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ

విశాలాంధ్ర - అగళి: స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు సౌకత్ అలీ ఏర్పాటు చేసిన రంజాన్ వేడుకల్లో నియోజకవర్గ సమన్వయ కర్త మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆదివారం మడకశిర యోజకవర్గంలోని టీడీపీ కార్యాలయంలో మైనారిటీ సోదరులందరికి రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అలాగే తేనేటి విందులో గుండుమల తిప్పేస్వామి తోపాటు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ మూర్తి, స్థానిక జడ్పీటీసీ ఉమేష్, నియోజకవర్గ డాక్టర్ సెల్ అధ్యక్షులు కొంకల్లు కృష్ణమూర్తి, విశ్రాంత ఉద్యోగి మల్లికార్జున, నియోజకవర్గ బిసి సెల్ అధ్యక్షులు తిప్పేస్వామి, మాజీ సర్పంచ్ రవికుమార్, మాజీ సింగల్ విండో అధ్యక్షులు శ్రీనివాస్, మాజీ ఎంపీపీ నరసింహప్ప, మడకశిర నియోజకవర్గ మైనారిటీ నాయకుడు నజీర్, సౌకత్ అలీఖాన్, మైనారిటీ సోదరులు పాల్గొన్నారు.

అక్రసంబంధమే హత్యకు దారి తీసిందా ..?

విశాలాంధ్ర -బత్తలపల్లి: అనంతపురం పట్టణానికి చెందిన బాబా ఫక్రుద్దీన్ హత్య కేసును బత్తలపల్లి పోలీసులు ఛేదించినట్లు సమాచారం. అయితే పలు ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చినట్లు తెలిసింది. ఈ హత్య అక్రమ సంబంధం తోనే హత్య జరిగిందా లేక వేరే కారణాలు ఏవైనా ఉన్నాయని లోతుగా విచారణ చేస్తున్నారు. నగరంలోని బుడ్డప్ప నగర్ కు చెందిన బాబా ఫక్రుద్దీన్ కదిరి పట్టణానికి చెందిన ఓ మహిళతో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారు. అయితే ఆమెకు అప్పటికే ఓ వ్యక్తితో వివాహేతర సంబంధం ఉన్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైనట్లు సమాచారం. బాబా ఫక్రుద్దీన్ ను ఈనెల 16వ తేదీన అనంతపురంలో హత్య చేసి వాహనంలో తీసుకొచ్చి మండల పరిధిలోని యర్రాయపల్లి సమీపంలోని హెచ్ఎల్సీ కాలువ దగ్గర ఉన్న ఓ పొలంలో పడేసి వెళ్లారు. స్థానికుల సమాచారంతో బత్తలపల్లి పోలీసులు వెళ్లి మృతదేహాన్ని పరిశీలించి విచారణ చేస్తుండగా పై విధంగా వివరాలు రాబట్టినట్లు సమాచారం. అయితే హత్యలో ఇద్దరు పాల్గొని కిరాతకంగా హత్య హత్య చేసి పొలంలో పడేసి పోయారు.ఇప్పటికే హంతకుని భార్యతో పాటు మరో ఒక వ్యక్తిని కూడా విచారణ చేసినట్లు సమాచారం తెలిసింది. నిందితులను ఒకటి రెండు రోజుల్లో అరెస్టు చేసే అవకాశాలు ఉన్నట్లు ప్రచారం జరుగుతుంది.

మజ్జిగ పంపిణీ

విశాలాంధ్ర-ధర్మవరంటౌన్: పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్లో అక్షయ తృతీయ సందర్భంగా ఆదివారం నాడు గాయత్రి పరివార్, ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంఘం, యుగ పరివర్తన మిషన్ అండ్ మిత్రబిందం ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని వారు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వన్టౌన్ సిఐ సుబ్రహ్మణ్యం హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రస్తుత ఎండాకాలంలో ఇటువంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం వల్ల పేద ప్రజలకు ఇది ఎంతో ఉపయోగకరమైన వారు తెలిపారు. ఇటువంటి కార్యక్రమాలు చేపట్టిన ఈ సంఘాలను వారు అభినందించారు.

సత్రం ప్రారంభం

విశాలాంధ్ర-కదిరి: పట్టణంలో వెలిసిన లక్ష్మి నరసింహ స్వామి దేవస్థానమునకు సంబందించిన చలపతినాయుని సత్రంను ఆదివారము ఎమ్మెల్యే సిద్దారెడ్డి ప్రారంభం చేశారు. దేవస్థానమునమునకు వచ్చు భక్తుల వసతి సౌకార్యములలో భాగంగా 32 వసతి గదులని నిర్మించి అందుబాటులోనికి తీసుకొనిరావడం జరిగిందని,డిలాక్స్ సూట్ రూములు, ఎ.సి. రూములు, నాన్ ఎ.సి గదులతో పాటు భక్తులు తలనీలాలు సమర్పించుటకు కళ్యాణ కట్ట ఏర్పాటుతో పాటు కామన్ బాతురుములు ఏర్పాటు చేశామని తెలిపారు. ఆలయ ఈవో పట్టెం గురుప్రసాద్, ఆలయ కమిటి ఛైర్మెన్ జెరిపిటి గోపాల క్రిష్ణ, .ఎ.డి.పార్థసారథి చార్యులు, ప్రధాన అర్చకులు ఎగ్జిక్యూటివ్ ఇంజనర్, .యస్.సతీష్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్,.శ్రీనివాస్ ప్రసాద్ అంజన్ కుమార్ చార్యులు ముఖ్య అర్చకులు, ఆలయ పాలకమండలి సభ్యులు పాల్గోన్నారు.

ప్రమాదంలో ఇద్దరికీ తీవ్ర గాయాలు

విశాలాంధ్ర -బత్తలపల్లి : ముందర వెళుతున్న ద్విచక్ర వాహనాన్ని వెనకనుంచి వచ్చిన కారు ఢీ కొనడంతో ద్విచక్ర వాహనంలో ఉన్న భార్యాభర్తలిద్దరూ తీవ్రంగా గాయపడిన సంఘటన బత్తలపల్లిలో చోటుచేసుకుంది. స్థానికులు బాధితుల కథనం మేరకు.. అనంతపురం రూరల్ మండలం చియ్యేడు గ్రామానికి చెందిన భార్య భర్తలు వెంకటలక్ష్మి, ఆదినారాయణ తమ పని నిమిత్తం ముదిగుబ్బ మండలం ముక్తాపురం గ్రామానికి వెళ్లి తిరిగి వస్తుండగా బత్తలపల్లి లోని ఆర్డిటి ఆసుపత్రి వద్దకు రాగానే వెనకనుంచి వేగంగా వచ్చిన కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో భార్యాభర్తలు ఇద్దరు కూడా తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే స్థానికులు స్థానిక ఆసుపత్రిలోకి చేర్పించారు ప్రస్తుతం ఇక్కడ వైద్యులు ప్రథమ చికిత్సలు చేస్తున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు.

వేడుకల్లో బీజేపీ నాయకులు

విశాలాంధ్ర - అగళి : బీజేపీ జిల్లా ఫైనాన్స్ కమిటీ కన్వీనర్ అంగడి రామాంజనేయులు నూతనంగా నిర్మించిన గృహప్రవేశ వేడుకల్లో బిజెపి నాయకులు పాల్గొన్నారు. వేడుకల్లో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి పిడి పార్థసారధి, బిజెపి కిషన్ మోర్చా జోనల్ ఇన్చార్జ్ చంద్రశేఖర్, బిజెపి హిందూపురం పట్టణ అధ్యక్షులు శంకర్, హిందూపురం రూరల్ మండల ఉపాధ్యక్షుడు నరసింహమూర్తి పాల్గొన్నారు. రామాంజినేయులు, నాయకులకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.

ప్రభుత్వానికి సెల్ఫీతో చాలెంజ్

విశాలాంధ్ర-పెనుకొండ: మండల పరిధిలోని గొల్లపల్లి రిజర్వాయర్ నిర్మాణం అతి వేగంగా పూర్తి చేసి తద్వారా కృష్ణ జలాలను గొల్ల పల్లి రిజర్వాయర్ నింపి పెనుకొండ నియోజకవర్గం, తాగు నీటి ,సాగునీటి సమస్యను, హిందూపురం కు తాగునీటి సమస్యను తీర్చిన ఘనత ,అపర భగీరథుడు మా అధినేత అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుది. అభివృద్ధి కి నిదర్శనం తెలుగుదేశం పార్టీదేనని, వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఇరిగేషన్ ప్రాజెక్టులను రిజర్వాయర్లను పూర్తిగా గాలికి వదిలేసారంటూ సెల్ఫీతో ఆదివారం రిజర్వాయర్ దగ్గర చాలెంజ్ చేసిన తెదేపా రాష్ట్ర నిర్వహక కార్యదర్శి సవితమ్మ ఆమె మాట్లాడుతూ హిందూపూర్ కు తాగు నీటి కోసం 190 కోట్లతో ఇక్కడి నుండే పంపింగ్ అదే విదంగా పెనుకొండ పట్టణానికి 10 కోట్లతో నీటి సరఫరా చేయడం ప్రజల దాహార్తిని తీర్చడం తెలుగుదేశం పార్టీ అభివృద్ధి కార్యక్రమం ఇంకా అనేక చెరువులకు చరిత్రలో మొదటిసారి కృష్ణ వాటర్ నింపిన చరిత్ర గత తెలుగుదేశం ప్రభుత్వంది.

నేడు పంచాయతీరాజ్ దినోత్సవం

విశాలాంధ్ర-గోరంట్ల: జిల్లా కలెక్టర్ మరియు అనంతపురం జిల్లా ,జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి ఆదేశాల మేరకు గోరంట్ల మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల్లో నేడు సోమవారం జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం ను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రఘునాథ్ గుప్తా తెలిపారు,ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో ఎంపీటీసీ,వార్డు మెంబర్, ప్రజా ప్రతినిధులు, ప్రజలు ఆహ్వానించి, గ్రామసభలు నిర్వహించి, అందరూ పంచాయితీ కార్యదర్శులు 9 రకాల థీమ్స్ గురించి చర్చించి,మినిట్స్ రికార్డ్స్ రాసి , గ్రామసభ ఫోటోలను అప్లోడ్ చేయాలని కోరారు, అదేవిధంగా జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవ కార్యక్రమాన్ని అన్ని గ్రామ సచివాలయాల్లో విజయవంతంగా నిర్వహించాలన్నారు,మండల ప్రజా పరిషత్ కార్యాలయం నందు మధ్యాహ్నం 3 గంటలకు మండల ఎంపీపీ, గౌరవ జడ్పిటిసి, ఆధ్వర్యంలో జరగబోవు జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవ కార్యక్రమానికి,జిల్లా కో ఆప్షన్ సభ్యులు, మండల కో ఆప్షన్ సభ్యులు, సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, అందరూ పంచాయితీ రాజ్ కార్యదర్శులు, జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవ కార్యక్రమానికి హాజరు కావాలని ఆయన కోరారు.

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చొద్దు

విశాలాంధ్ర-పెనుకొండ: ఆదివాసి గిరిజన సంఘాలు 7వ తేదీన విజయవాడలో సమావేశమై ఏకగ్రీవంగా తీసుకున్న నిర్ణయం మేరకు రాష్ట్రవ్యాప్తంగా 26 జిల్లాల నుండి ముఖ్యమంత్రి ఇల్లు ముట్టడి కార్యక్రమానికి పార్టీ అతీతంగా సంఘాల అన్ని ఏకమై పెద్ద ఎత్తున బయలుదేరుతున్నారు. అందులో భాగంగా సత్య సాయి జిల్లా పెనుకొండ నుండి ఆదివారం బయలుదేరుతున్న గిరిజన జాతి హక్కుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు హరిలాల్ నాయక్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రంజిత్ నాయక్ లను అడ్డుకొని పోలీస్ స్టేషన్ కు తరలించారు. దీనికి తీవ్రంగా ఖండిస్తున్నాం. అభివృద్ధి చెందిన కులాలను ఎస్టీలలో చేర్చి మా పొట్టలను కొట్టాలని చూస్తే తప్పకుండా మా గిరిజనులు ఉసురు తప్పకుండా తగలకుండా ఊరుకోదని, రాబోయే ఎన్నికలలో మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. గత ప్రభుత్వాలు కూడా ఇదే విధానాన్ని పాటించారని, వారికి పట్టిన గత్ ఈ ప్రభుత్వానికి కూడా పడుతుందని హెచ్చరించారు. మమ్మల్ని అడ్డుకొని ఉద్యమాలను ఆపలేరని ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా గిరిజన ప్రజలు బోయ వాల్మీకులను ఎస్టి ల లో చేరుస్తూ ముఖ్యమంత్రి చేసిన తీర్మానం తో పెనుమంటలే రగులుతున్నారని తెలిపారు. మమ్మల్ని అడ్డుకోవడం ప్రజాస్వామ్యం ఇప్పటికైనా ముఖ్యమంత్రి గిరిజనులు ఆవేదనను అర్థం చేసుకొని అసెంబ్లీలో చేసిన తీర్మానం వెనక్కి తీసుకోవాలని హరిలాల్ నాయక్ కోరారు.

దేశ సంపదను సంపన్నులకు దోచిపెడుతున్న మోదీని గద్దె దింపుదాం

విశాలాంధ్ర-కదిరి: దేశ సంపదను సంపన్నులకు దోసి పెడుతున్న మోదీని గద్దె దింపి దేశాన్ని కాపాడు కొందామని సీపీఐ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఆదివారం సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి కదిరప్ప ఆధ్వర్యంలో పట్టణంలోని రాయలసీమ సర్కిల్ నుండి వలిసాబ్ రోడ్డులోని ప్రతి ఇంటికి వెళ్లి కర పత్రాలు పంపిణీ చేశారు. ఈనెల 14 నుండి 30వ తేదీ వరకు సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా జరగనున్న మోడీ హటావో - దేశ్ బచావో పేరుతో ప్రచార బేరి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక, నిరంకుశ, మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా ప్రజల్ని చైతన్యం చేసేందుకు ఈ కార్యక్రమాన్ని రూపొందించినట్లు తెలిపారు. బిజెపి ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చాక భారత రాజ్యాంగానికి తూట్లు పొడుస్తూ నిరంకుశ ధోరణితో వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతోందని మండిపడ్డారు. ప్రజల్లో కులతత్వాన్ని, మతోన్మాదాన్ని రెచ్చగొడుతోందని విమర్శించారు. మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను ప్రజలకు వివరిస్తూ వారిని చైతన్యం చేసేందుకు 14వ తేదీ నుండి 30వ తేదీ వరకు ప్రచార బేరి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి లియాకత్, సహాయ కార్యదర్శి మనోహర్, ఏపీ రైతు సంఘ జిల్లా అధ్యక్షులు హనుమంత్ రెడ్డి, మధు, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు మధు నాయక్, వ్యవసాయం కార్మిక సంఘ నాయకులు రమణ, శ్రీనివాసులు, శంకర రెడ్డి, బాష, మహిళా సంఘం నాయకురాలు జ్యోతి, కల్పన, శ్రీలత పాల్గొన్నారు.

ధర్మవరంటౌన్: నేటి బిజెపి ప్రభుత్వంలో దేశ ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని, కార్పొరేట్ సంస్థలకే మొగ్గు చూపడం దారుణమని, బిజెపి ప్రభుత్వ పాలనలో ప్రజలు విసుకు చెందారని, అందుకే మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించి దేశాన్ని కాపాడుకుందాం అని సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి మధు, సిపిఎం నాయకులు పోలా రామాంజనేయులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆదివారం స్థానిక సిపిఎం కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చినప్పటి నుండి ప్రజా వ్యతిరేక నిరంకుశ విధానాలు అవలంబిస్తూ, మనమందరం ఉమ్మడి సంపదగా ఉన్న బ్యాంకులు, మనం కట్టిన పన్నులతో నిర్మించిన ప్రభుత్వ రంగ పరిశ్రమల్ని, ఓడరేవుల్ని, ఆఖరికి మనందరికీ అన్నం పెట్టే వ్యవసాయాన్ని సైతం కార్పొరేట్లకు ధారాతత్తు మోడీ ప్రభుత్వం చేయడం దారుణమని తెలిపారు. ప్రధానమంత్రి మోడీ అండదండలతో అధాని ఏ విధంగా ప్రపంచాన్ని మోసం చేసి లక్షల కోట్లు కొల్లగొట్టాడు హిడెన్ బర్గ్ నివేదిక బట్టు బయలు చేసిందని తెలిపారు. అయినా కూడా దానిమీద విచారణ అంగీకరించకుండా దానినే కేంద్ర ప్రభుత్వం వెనుకేసుకొరావడం దారుణం అన్నారు. పైగా మరింత వేగంగా దేశంలోని అడవులను, భూములను, విద్యుత్ ప్రాజెక్టులను, ఘనులను కార్పొరేట్లకు అక్రమంగా కట్టబెట్టడం ఎంతవరకు సమంజసమని? వారు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పేదలకు సామాన్య ప్రజలకు అండగా ఉండాల్సింది పోయి, వారి మీదే మోయలేనంత భారాలను మోపుతున్నది నేటి మోడీ ప్రభుత్వమని దొయబడ్డారు. గ్యాస్ బండ మనందరికీ గుడిబండ అయిపోయిందని కరెంటు బిల్లులు ముట్టుకుంటే షాక్ కొడుతున్నాయని పెరుగుతున్న పెట్రోల్ డీజిల్ ధరలు మన బతుకుల మంటలను కాజేసున్నాయని తెలిపారు. నిత్యావసర ధరలు కొండెక్కాయని నిరుద్యోగుల బతుకులు అగాధములోకి జారిపోతున్నాయని కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వడం లేదని పేదలకు విద్య వైద్యం అందనంత దూరం గా ఉన్నాయని, కార్పొరేటు వ్యాపారంగా మారిపోయిందని, గ్రామీణ పేదలకు ప్రాణాదారంగా ఉన్న ఉపాధి హామీ పథకాన్ని సైతం మోడీ ప్రభుత్వం అటకెక్కించాలని చూస్తున్నదని వారు తెలిపారు. 75 సంవత్సరాల క్రితం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మౌలానా ఆజాద్ పటేల్ బాబు జగ్జీవన్ రామ్ వంటి మహా నాయకుల నేతృత్వంలో మనం రూపొందించుకున్న రాజ్యాంగం సైతం నేడు మోడీ తదుపరిష ప్రభుత్వానికి కంటగిప్పుగా ఉందని, రాజ్యాంగానికి మూల స్తంభాలుగా ఉన్న ప్రజాస్వామ్యం, లౌకికతత్వం, సామాజిక న్యాయం వంటి గొప్ప విలువలను ఈ ప్రభుత్వం కాలరాస్తోందని వారు తెలిపారు. కావుననే ప్రతి వ్యక్తి కేంద్ర ప్రభుత్వం యొక్క దుర్మార్గాన్ని నినదీయాల్సిన సమయం ఆసన్నమైనదని తెలుపుతూ భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ సిపిఎం ఆధ్వర్యంలో ఈ నెల 25న జరిగే కార్యక్రమానికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ రానున్నారని వారు తెలిపారు. కావున ప్రజలందరూ అధిక సంఖ్యలో పాల్గొని, కేంద్ర ప్రభుత్వానిపై ఒత్తిడి తీసుకొని రావాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు పెద్దన్న, సిపిఐ పట్టణ కార్యదర్శి రవికుమార్, వెంకటరమణ, భాష తదితరులు పాల్గొన్నారు.

పేదలకు సేవ చేయడంలోనే సంతృప్తి

విశాలాంధ్ర-ధర్మవరంటౌన్: పేద ప్రజలకు వైద్య సేవ చేయడంలోనే సంతృప్తి ఉందని శ్రీ చౌడేశ్వరి దేవాలయ అభివృద్ధి సంఘం ఉపాధ్యక్షులు కాచర్ల నారాయణస్వామి, కోశాధికారి డివి వెంకటేశులు (చిట్టి), కార్యదర్శి సిరివెళ్ల రాధాకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలోని తొగట వీధిలో గల శ్రీ శాంత కళా చౌడేశ్వరి దేవాలయ ఆవరణములో దేవాలయ అభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో 86వ ఉచిత వైద్య చికిత్స శిబిరం ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ శిబిరానికి వైద్యులు వివేకుల్లయప్ప, వెంకటేశ్వర్లు, సాయి స్వరూపు, డాక్టర్ వినయ్ లు వైద్య చికిత్స,ఆరోగ్యం పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలను వారు వివరించారు. అనంతరం కాచర్ల నారాయణస్వామి, వెంకటేశులు మాట్లాడుతూ ప్రతినెల నాలుగవ ఆదివారం ఉచిత వైద్య శిబిరంలో వైద్య చికిత్సలతో పాటు మందులను కూడా ఉచితంగా పంపిణీ చేస్తున్నామని వారు తెలిపారు. దాతల సహాయ సహకారాలతోనే ఈ శిబిరం దిగ్విజయంగా నడుస్తోందని వారు తెలిపా రు. నేటి శిబిరానికి తాతగా కీర్తిశేషులు మామిళ్ళ రంగప్ప జ్ఞాపకార్థం వీరి ధర్మపత్ని,మామిళ్ల నారాయణమ్మ, వీరి కుమారుడు, మాధవి, మామిళ్ళ తులసీదాస్ అండ్ సన్స్ వారు వ్యవహరించడం పట్ల సంతోషాన్ని వ్యక్తం చేశారు. నేటి శిబిరంలో 177 మంది రోగులు హాజరు కావడం జరిగిందని తెలిపారు. వీరందరికీ కూడా నెలకు సరిపడా మందులను పంపిణీ చేయడం జరిగిందన్నారు. అనంతరం శిబిర దాత మామిళ్ళ తులసి ప్రసాదును ఆలయ కమిటీ వారు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సహకార దర్శి బండి నాగరాజు, మామిళ్ళ అశ్వత్ నారాయణ, సభ్యులు పాల్గొన్నారు.

బసవన్న జీవితం అందరికి ఆదర్శం

విగ్రహ ఏర్పాటుకు లక్ష విరాళం

జయంతి వేడుకల్లో కొండురు మల్లికార్జున

విశాలాంధ్ర - హిందూపురం : ఆధునిక కాలంలో ఆచారిస్తున్న వద్దతులను 12వ శతాబ్దంలోనే ఆచారించి అందరికి ఆదర్శంగా నిలచిన బసవన్న జీవితం అందరికి ఆదర్శమని, వీరశైవ సంఘం గౌరవ సలహాదారుడు కొండురు మల్లికార్జున అన్నారు. అదివారం పట్టణంలోని చిన్న మార్కెట్లో ఉన్నా బసప్ప సత్రం లో బసవన్న జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కొండూరు మల్లికార్జున మాట్లాడుతూ, వీరశైవ సంఘము కళ్యాణమం డపం నిర్మాణం, బసవన్న విగ్రహం ఏర్పాటు, ఆర్థికంగా వెనుకబడిన కులస్తులకు 50పైసలకే రుణాలు ఇప్పించే ప్రయత్నం చేస్తామని ప్రకటించారు. హిందూపురంలో శ్రీ బసవేశ్వర విగ్రహం ఏర్పాటుకు లక్ష రూపాయలు విరాళం అందిస్తామన్నారు. అదే విధంగా మే 5న లేపాక్షిలో జరగనున్న బసవన్న జయంతి వేడుకలకు పది వేలు రూపాయలు అందిస్తానన్నారు. కోన ఆశ్రమం పీఠాధిపతి దత్తానందగిరి స్వామి మాట్లాడుతూ, 12వ శతాబ్దంలోనే సాక్షి కాత్తు ఈశ్వరుని వాహనం నందీశ్వరుడు శరణు బసవేశ్వరుని రూపంలో భూమిపై పుట్టి, సమ సమాజ స్థాపనకు పాటుపడ్డాడన్నారు. లక్షలాది రచనాలను రచించాడని పేర్కొన్నారు. భగవంతుడు నిరాకారుడని అందుకే వీరశైవలింగాన్ని పూజ చేస్తారన్నారు. మరి కొంత మంది మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం బసవన్న జయంతి వేడు కలను అధికారికంగా నిర్వహిస్తామని ఉత్తర్వులు వెల్లడించడం జరిగింది. అయితే స్థానికంగా జరిగిన వేడుకల్లో అధికారులు, అనంతరం సాయంత్రం పూల పల్లకి ఉత్సవం ఘనంగా జరిగింది. సంఘం అధ్యక్షులు వీరభద్రప్ప, ఉమేష్, సంపత్ పాటు పెద్ద ఎత్తున వీరశైవ సంఘం ప్రతి నిధులు, మహిళలు పాల్గోన్నారు.

సెమీస్‌కు చేరిన హాకీ టోర్నీ

విశాలాంధ్ర-ధర్మవరంటౌన్: పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఏర్పాటుచేసిన జిల్లా హాకీ టోర్నమెంట్ ఈనెల 21 నుండి ఉత్సాహపరతంగా కొనసాగుతోంది. మూడవరోజు జరుగుతున్న హాకీ క్రీడా పోటీలకు ముఖ్య అతిథిగా మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున పాల్గొన్నారు. అనంతరం క్రీడాకారులతో గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం వారు మాట్లాడుతూ నేడు ధర్మవరం క్రీడలకు నిలయంగా మారిందని, జిల్లా ,రాష్ట్ర, జాతీయ స్థాయిలకు ఎదిగే విధంగా క్రీడాకారులు కృషి చేయడం నిజంగా అభినందనీయమని తెలిపారు. ధర్మవరం పట్టణంలో అన్ని క్రీడలకు నేడు ఈ క్రీడా మైదానం ఒక వేదికగా మారడం అభినందనీయమన్నారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి విజేతలలో విన్నర్స్ కు 50 వేల రూపాయలు, రన్నర్స్ కు 25వేల రూపాయలు, మూడవ బహుమతిగా పదివేల రూపాయలు తన సొంత ఖర్చుతో విజేత క్రీడాకారులకు పంపిణీ చేస్తానని వారు హామీ ఇవ్వడం పట్ల వారు సంతోషాన్ని వ్యక్తం చేశారు. అనంతరం ఏపీ హాకీ ఉపాధ్యక్షులు, శ్రీ సత్య సాయి జిల్లా హాకీ జనరల్ సెక్రెటరీ సూర్యప్రకాష్ మాట్లాడుతూ ఈ హాకీ క్రీడలు లేట్ బిఎస్ రాయుడు మెమోరియల్ 13వ హాకీ ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఇంటర్ డిస్ట్రిక్ సీనియర్ మెన్ హాకీ ఛాంపియన్షిప్-2023 నిర్వహించడం జరుగుతుందన్నారు. 15 జిల్లాల నుంచి హాకీ జెట్లు పాల్గొంటున్నాయ ని తెలిపారు. హాకీ పోటీల్లో పాల్గొనే వారందరికీ కూడా సాయి నగర్ లోని శ్రీ షిరిడి సాయిబాబా కళ్యాణ మండపంలో ఉచిత వసతి ఉచిత భోజన సౌకర్యం కూడా కల్పించడం జరిగిందని వారు తెలిపారు. ఈ రాష్ట్రస్థాయి హాకీ పోటీలు ఈనెల 24న ముగుస్తాయన్నారు. ఆదివారం రోజున 6 జట్లు పోటీల్లో పాల్గొనాలని ఇందులో..... వైయస్సార్ కడప వర్సెస్ అనకాపల్లి-స్కోరు 1-0, విజేత వైయస్సార్ కడప, తదుపరి గుంటూరు వర్సెస్ కాకినాడ డ్రా కావడం జరిగిందని, తదుపరి విశాఖపట్నం వర్సెస్ శ్రీ సత్యసాయి జిల్లా-విజేత విశాఖపట్నం స్కోరు 1-0, తదుపరి ప్రకాశం వర్సెస్ విజయనగరం విజేత విజయనగరం స్కోరు 0-5, అనంతరం అనంతపూర్ వర్సెస్ తిరుపతి డ్రా కావడం జరిగిందన్నారు. సెమీ ఫైనల్ కు గుంటూరు, తిరుపతి, విశాఖపట్నం చేరుకున్నయన్నారు. ఈ జె ట్లు సోమవారం జరుగుతాయన్నారు. అనంతరం ముఖ్యఅతిథి మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున ను ఘనంగా సత్కరిస్తూ మెమొంటోను అందించారు..ఈ కార్యక్రమంలో జి జి ఎఫ్ జిల్లా కార్యదర్శి అంజన్న, ఉడుముల రామచంద్ర, హ సేన్,చందు ,అరవింద్ గౌడ్ ,మారుతి ప్రసాద్, గౌరీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో వైసీపీ కార్యకర్త మృతి

విశాలాంధ్ర-పెనుకొండ: మండల పరిధిలోని కురుబ వాండ్లపల్లి గ్రామానికి చెందిన బోయ పెద్ద ఆంజనేయులు(78) ఆదివారం మధ్యాహ్నం అపరస్మారక స్థితిలోకి చేరుకోవడంతో వారి బంధువులు హుటాహుటిన పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించే లోపు మరణించినట్లు వైద్యులు తెలపడంతో మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొని వచ్చారు. మృతునికి భార్య అంజనమ్మ, కుమారులు సోమశేఖర్, నాగేంద్ర ఉన్నారని, అలాగే ఇతను రోడ్డు పనులకు వెళ్లి ఘర్షణ పడ్డారని, వదంతలు వెల్లడంతో కియా ఎస్ఐ వెంకటరమణ సంఘటన స్థలానికి చేరుకొని అక్కడ ఉన్న వారందరితో విచారించారు. అతనికి గతంలోని గుండె ఆపరేషన్ జరిగినట్లు సాధారణంగా చనిపోయినట్లు తెలిపారు. మృతునికి సర్పంచ్ నాగమూర్తి, మండల వైస్ ఎంపీపీ రామాంజనేయులు, తమ నివాళులు అర్పించి సంతాపాన్ని తెలియజేశారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

విశాలాంధ్ర-ధర్మవరంటౌన్: పట్టణంలోని కొత్తపేట లోని రామ్ నగర్ లో గల కోదండ రామస్వామి దేవాలయంలో ఆదివారం సేవా భారతి ఆధ్వర్యంలో సిద్ధ ఆయుర్వేద యోగ ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన రావడం జరిగిందని సేవా భారతి నిర్వాహకులు తిరుమలేష్, నరేష్ బాబు, దాసరి రామన్న, రవీంద్ర దాసు, ఆలయ కమిటీ అధ్యక్షులు సోమశేఖర్, పులిచెర్ల వేణుగోపాల్, విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షులు పూజారి మల్లికార్జున పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ శిబిరంలో నూరు మందికి రోగులకు ప్రముఖ ఆర్తో న్యూరో ఆర్క్ ప్రెషర్ హైదరాబాద్ వైద్య నిపుణులు జైశ్రీరామ్ గురూజీ చేత, వారి శిష్య బృందం చేత నూరు మందికి వైద్య చికిత్సలను అందించారు.

ఘనంగా ప్రపంచ పుస్తక దినోత్సవం

విశాలాంధ్ర-ధర్మవరంటౌన్: పట్టణంలోని బాబు జగ్జీవన్ రామ్ నగర్ లో గల ప్రధాన పౌర శాఖ గ్రంథాలయంలో ఆదివారము నాడు గ్రంథాలయ సిబ్బంది రమణ నాయక్, పాఠకుల ఆధ్వర్యంలో ప్రపంచ పుస్తక దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా నక్కల వెంకటేశులు, రమణ నాయక్, డి. లోకేష్ లు మాట్లాడుతూ నేడు గ్రంథాలయాలలో అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉండడం వల్ల, విద్యలో నైపుణ్యతను సాధించడం జరుగుతుందన్నారు. దొంగతనం చేయనిది ఒక విద్య మాత్రమేనని తెలిపారు. విద్యను అభ్యసించి వాడు జీవితంలో సుఖవంతమైన జీవితాన్ని పొందుతాడని తెలిపారు. గ్రంథాలయం సభ్యత్వంతో వివిధ రకాల పుస్తకాలను కూడా ఇంటికి అందజేస్తుందని తెలిపారు. పాఠకులు రాజశేఖర్రెడ్డి, కేశవ, హరి, నారాయణ స్వామి, రామాంజనేయులు, భరతు, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సేవలు పేదలకు వరం

విశాలాంధ్ర-ధర్మవరంటౌన్: లయన్స్ క్లబ్ సేవలు పేద ప్రజలకు వరం లాంటివని వన్టౌన్ సీఐ సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ బాలుర హై స్కూల్ ఆవరణంలో ఉచిత కంటి చికిత్స శిబిరమునకు ముఖ్య అతిథిగా వారు విచ్చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ లయన్స్ క్లబ్ వెహికల్ 1976 నుంచి మొదలై ఇప్పటివరకు 61 వేలకు పైగా పేద ప్రజలకు కంటి ఆపరేషన్ నిర్వహించడం గర్వించదగ్గ విషయమని తెలిపారు. అనంతరం లయన్స్ కంటి ఆసుపత్రి వ్యవస్థాపకులు వెంకటస్వామి మాట్లాడుతూ ప్రతినెల ఉచిత కంటి చికిత్స శిబిరాన్ని పేద ప్రజల కొరకు నిర్వహిస్తున్నామని, సీఐ సుబ్రహ్మణ్యం క్యాంపు దాత చెన్నం శెట్టి జగదీష్ ను లైన్స్ క్లబ్ కమిటీ వారు ఘనంగా సత్కరించారు. కంటి డాక్టర్ నాగేంద్ర క్లబ్ అధ్యక్షులు చందా నాగరాజు, కార్యదర్శి మోహన్దాస్, సభ్యులు జి రాధాకృష్ణ పుట్టి శివప్రసాద్ గవ్వల రాధాకృష్ణ వుట్లూరు నరసింహులు టీచర్ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

పేదల కోసమే ఎన్టీఆర్ అన్నక్యాంటీన్

విశాలాంధ్ర-పెనుకొండ: నియోజకవర్గ కేంద్రంలో ఎన్టీఆర్ సర్కిల్ వద్ద ఉన్న సవితమ్మ కార్యాలయం నందు 5 రూపాయలకే 63వరోజులుగా ఎన్టీఆర్ అన్నా క్యాంటీన్ వద్ద పేదల కోసం మంచి భోజనం ఏర్పాటుచేసిన తెలుగుదేశంపార్టీ రాష్ట్రకార్యనిర్వాహకకార్యదర్శి సవితమ్మ. ఆమెతో పాటుగా గోపాల్, ప్రసాద్, త్రివేంద్ర, బాబుల్ రెడ్డి, వెంకటేష్, గోవిందు, సూర్యనారాయణ ఉన్నారు.

నేడు ఎంపీడీవో కార్యాలయంలో సమావేశం

విశాలాంధ్ర-కొత్తచెరువు: ఈనెల 24వ తేదీ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా ఎంపీడీవో కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీవో సిద్దారెడ్డి తెలిపారు. ఈ సమావేశానికి ఎంపీపీ, జడ్పిటిసి, మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు, ఎన్ ఆర్ జి ఎస్ సిబ్బంది పాల్గొనాలని సూచించారు. ఈ సమావేశంలో పంచాయతీల గురించి చర్చించడం జరుగుతుందన్నారు.